# గుండె తడి

పంతుల జోగారావు

సుందరానికి ప్రస్తుతం తనున్న పరిస్థితి అయోమయంగా ఉంది. అసహనంగానూ ఉంది. అసలు త నిలాంటి పరిస్థితుల్లో ఇరుక్కోవలసి వస్తుందని ఎన్నడూ ఊహించనయినా లేదు. తన మీద తనకే జాలి వేసింది. తన మీద తనకే కోపం వచ్చింది. తిక్కగా ఉంది. బహుశా తనలాగా ఎవరూ ఇలా తెలివితక్కువగా ప్రవర్తించరు. ప్రవర్తించి ఇలాంటి లజ్జాకర మయిన చిక్కులు కొని తెచ్చుకోరు.

అతను ఎరుపు రంగు గోడల మధ్యకు వచ్చి అప్పుడే దాదాపు నాలుగు గంట లవుతోంది. తనని తీసుకువచ్చి ఇక్కడ కుదేసిన కానిస్టేబులు మరింక అయిపు లేడు. త నింకా ఈ పోలీస్ స్టేషన్లో ఎంతసే వుండాలో తెలీదు. చివరికి తన స్థితి ఎలా పరిణమించబోతోందో ఊహకి అందడంలేదు. ఈ చిక్కు ముడి విప్పుకోగలడా? ఈ సాలెగూడు లోంచి సురక్షితంగా బయటపడగలడా అనే సందేహం అతనిని బాధిస్తోంది.

దాహం వేస్తోంది. అవమానంతో, బెంగతో ఆకలి ఎప్పుడో చచ్చిపోయింది. ఎవ రయినా కొంచెం మంచినీళ్ళు ఇస్తే బాగుణ్ణు. ఎవరి నడగాలో తెలీదు. అల్లంత దూరంలో రైటరు కాబోలు దీక్షగా ఏదో రాసుకుంటూ తల అసలు పక్కలకి తిప్పడమే లేదు. ఒకరో ఇద్దరో పోలీసు జవాన్లు అటూ ఇటూ తచ్చాడుతున్నప్పటికీ, ఎవరూ తన ఉనికిని గుర్తించడంలేదు.

తను కూర్చున్న బెంచీ మీద అసహనంగా కదిలేడు సుందరం. సన్నగా పొడి దగ్గు దగ్గేడు. అటువేపు వెళ్తున్న ఓ పోలీసు ఆగి, సుందరం కళ్ళలోకి సూటిగా చూసేడు. 'ఏం కావాలి బే?' అన్నట్టుగా పొగరుగా త లెగవేశాడు. సుందరం భయంతో కుంచించుకుపోయేడు. దాహంతో పిడుచ కట్టుకుపోతున్న గొంతు మరి పెగల్లేదు. సుందరం మాట్లాడకుండా జావ కారిపోవడం చూసి, విజయం వరించిన వీరుడిలా నవ్వుకుంటూ అక్కడ్నుంచి వెళ్ళిపోయేడు ఆ కానిస్టేబులు.

ఆ ఎర్ర గదిలో సుందరం మళ్ళీ ఒంటరివా డైపోయాడు. సుందరానికి దుఃఖం గొంతుకలో కొచ్చి గర గర లాడింది.

ఎస్సై వేగిరం వస్తే బాగుండును. తను చెప్పదల్చుకున్న దేదో అతనితోనే చెప్పుకోవచ్చును. వింటే సరేసరి. అతడు కూడా తన మాటలు పట్టించుకోకపోతేనో? మొదటిసారిగా ఆ ఆలోచన వచ్చి సుందరం సన్నగా జలదరించుకుపోయాడు. భయం ఒక చిన్న ప్రకంపనలా మొదలై ఉత్తుంగ తరంగమై, కల్లోలిత నీరధిగా మారి అతని మస్తిష్కాన్ని నిలువునా కుదిపి కుదిపి వదిలింది. ఇంతవరకూ తన గోడు ఎస్సైకి అర్థమవుతుందనీ, అతడు తనని సహృదయంతో అర్థం చేసుకోగలడనే ఆశ చిరుదీపంలా అతనికి ఉండేది. ఆ ఆశ కూడా ఇప్పుడు సందేహాస్పదం అయ్యేసరికి సుందరం పూర్తిగా కృంగిపోయేడు. తల భారంగా తయా రయింది. నీరసం కమ్ముకొస్తోంది. నిస్త్రాణగా తల వెనక్కి వాల్చి బరువుగా కళ్ళు మూసుకున్నాడు.

అసలు త నీ ఊరు ఎందుకు వచ్చినట్టు? ఈ ఊళ్ళో తన కేం ప నుంది? పనిమాలి ఇక్కడి కొచ్చి కాలికి బలపం కట్టుకుని పిచ్చి పిచ్చిగా ఊరంతా తగుదునమ్మా అని చుట్టబెట్టాడు. చివరి కేమయింది? ఆ బుర్రమీసాలు పోలీసు దృష్టిలో పడ్డాడు. 'నాకేం తెలీదు మొర్రో, నన్ను వదిలెయ్యి' అంటూ కాళ్ళా గడ్డం పట్టుకు ప్రేలాడినా, కనికరించలేదు. చుట్టూ ఉన్న జనం కూడా తనని ఒక గొప్ప దోషిలాగా చూశారు. సంఘానికి కీడు చేసే తక్షణ శత్రువు లాగా భావించేరు. క్షమించరాని నేరస్థుడిగా నిర్ణయించారు. తన లాంటి నేరస్థుడ్ని వెంటనే బొక్కలోకి తోసి శిక్షించకపోతే, శాంతి భద్రతలకి తీవ్రమయిన అఘాతం ఏర్పడుతుందని తీర్మానించారు. ఫలితంగా తనిక్కడి కొచ్చి పడ్డాడు. తిండీ తిప్పలూ లేవు. తన గోడు వినిపించుకునే నాథుడూ లేడు. గుడ్డిలో మెల్ల - తనని తీసుకొచ్చిన పోలీసు తనని నేరుగా కొట్లో తోసెయ్యలేదు. స్టేషన్లోకి తీసుకొచ్చి వసారా, ముందు గది దాటాక ఈ గదిలోకి నడిపించు కొచ్చి పొడవాటి బల్ల మీద కూచోమని శాసించాడు. దేబిరిస్తున్నట్టుగా చివరి ప్రయత్నంగా తను మళ్ళీ ఏదో అనబోతే పురుగుని దులపరించినట్టు అదిలించాడు. తన మొర వినే కర్మ అతని కేం పట్టనట్టుగా ప్రవర్తించేడు.

ఏం చెయ్యాలో తోచక ఆ బల్ల మీద చతికిలబడ్డాడు సుందరం. అలా తీసుకొచ్చిన తనని ఎప్పుడు వదిలేస్తారో, అసలు వదలరో, జైల్లో పడేస్తారో - లేదా ఏ నేరమో మోపి కోర్టుకి కట్టేస్తారో కూడా అర్థం కావడంలేదు సుందరానికి.

సుందరానికి ఏడు పొస్తోంది. అవును - తనని ఏ కారణమూ లేకుండానే ఆ బుర్రమీసాల పోలీసు లాక్కొచ్చి ఇక్కడ పడేశాడు. కేవలం - కేవలం అనుమానం మీదే తనని లాక్కొచ్చాడు.

ఈ దేశంలో పోలీసులు తమకి విస్తృతమయిన అధికారాలూ సంక్రమింపజేసుకున్నారు.

ఒక వ్యక్తిని ఏ అభియోగమూ లేకుండానే తెచ్చి జైల్లో పడెయ్యవచ్చు. నెలల తరబడి వేధించవచ్చు. అమానుషంగా బాధించవచ్చు. అసభ్య పదజాలంతో అవమానించవచ్చు.

ఆలోచిస్తున్న కొద్దీ సుందరానికి మెదడు వేడెక్కిపోతోంది.

అసలు తన కీ ఊరు రావాలనే ఆలోచన కలగకపోతే, ఇప్పు డీ అనర్థం జరిగేది కాదు. తన కీ అవస్థ ఏర్పడి ఉండేదీ కాదు. సుందరం ప్రస్తుతం ఉన్న పరిస్థితిలో అలా అనుకున్నాడే తప్ప - అత నీ ఊరు రాకుండా ఎలా ఉండగలడు? ఈ ఊరి మీద అతని కున్న మమకార్మం రాకుండా ఊరుకోనిస్తుందా -

నిజానికి ఇంటి దగ్గర బయలుదేరే ముందు సుందరానికీ ఊరు రావాలన్న ఆలోచనే లేదు. కంపెనీ పని మీద ప్రయాణమై వచ్చేడు - ఇక్కడికి ముప్పై కిలోమీటర్ల దూరంలో ఉన్న పట్నానికి. తీరా తన పని పూర్తి చేసుకుని ఇంటికి వెళ్ళిపోదామనుకుంటూండగా, యధాలాపంగా ఈ గ్రామం పేరు తన చెవిని పడింది. తనీ గ్రామానికి మరీ చేరువలోకి వచ్చాడని తెలుసుకుని అతని మనసు ఆనందంతో పొంగిపోయింది.


ఇది తను పుట్టిన ఊరు. తనకు జన్మ నిచ్చిన స్థలం. బాల్యంలో కొద్ది కాలం ఇక్కడ గడిచిందంతే. తర్వాత ఈ ఊరి ముఖమే చూడలేదు. ఈ గ్రామం పేరు విని అనిర్వచనీయమయిన ఆనందానుభూతికి లోనయ్యాడు. ఎక్కడో కోస్తా జిల్లాలో ఆ చివర ఉంటున్న తనకి మళ్ళీ ఇంత దూరం వచ్చే అవకాశం చిక్కుతుందన్న ఆశ లేదు. ఖర్చులు కంపెనీ భరిస్తోంది కనుక గానీ ఉ తనంత తానుగా డబ్బు ఖర్చు చేసి జీవిత కాలంలో మళ్ళీ ఈ ప్రాంతాలకి వచ్చే అవకాశం శూన్యం -

మళ్ళీ మళ్ళీ ఇంత దూరం రాలేడని తనకి తెలుసు. రానూ పోనూ పాతిక రూపాయల ఖర్చుతో పుట్టిన ఊరిని చూసే భాగ్యం కలుగుతున్నందుకు ఆనందంతో ఊగిపోయాడు. తన అదృష్టానికి పొంగిపోయాడు. పరవశించిపోయాడు.

ఈ ఊరు -

ఇక్కడే తనకి తన తల్లి జన్మ నిచ్చింది. మొదటిసారిగా తను కనులు విప్పి లోకాన్ని చూసింది ఈ నేల తల్లి ఒడిలోనే. ఈ ఊరు పేరు వింటేనే చాలు తన మనసు సంతోషంతో పులకించి పోతుంది. రెక్కలొచ్చిన పక్షిలా ఊహా లోకాల్లోకి ఎగిరిపోతుంది. ఆనందం అర్ణవమవుతుంది.

తాతగా రిక్కడ ప్రైవేటు డాక్టరుగా ఓ క్లినిక్ నడుపుతూ ఉండేవారు. అప్పట్లో అతనికి 'డాక్టర్ బాబాయ్'గా ఎంతో ప్రసిద్ధి ఉండేది. రోగుల్ని




ఎంతో ప్రేమగా స్వంత మనుమలుగా చూసుకునేవారని చెప్పుకునేవారు. తన తండ్రి ఆ ఇంటికి పెద్దల్లుడు. అప్పట్లో ఆ ఇల్లు కొడుకులూ, కోడళ్ళూ, మనవలూ, మనుమరాళ్ళతో కళ కళలాడిపోయేది.

త నిప్పుడు యేభయ్యో పడిలో పడ్డాడు. ఇదంతా ఎప్పుడో తన చిన్నప్పటి ముచ్చట. అప్పటి సంఘటనలు ఒకటీ అరా తప్ప తన కసలు గుర్తు లేవు. గుర్తుండే అవకాశమూ లేదు. సెలవుల్లో మూడు రైళ్ళు మారి అమ్మా నాన్నలతో అమ్మమ్మ గారింటికీ, ఈ ఊరు రావడం. ఆ ఇంటిని తను మరిచిపోలేడు.

బాల్యంలో తన లేత మనసు మీద పడిన అనుభూతి ముద్రల చిన్నెలు ఎప్పటికీ చెరిగిపోయేవి కావు.

గ్రామం, గ్రామంలో ఇతర పరిసరాలూ, వాటి గుర్తులూ తన స్మృతిపథంలో ఏమాత్రం నిలవలేదు. కాని ఆ ఇల్లు బాగా గుర్తు. అనుభూతి వైయక్తికం. అది కలిగించే ఆర్ద్రత కూడా వ్యక్తిగతమే.

విశాల మయిన ఆవరణలో ఉండే దా ఇల్లు. ఇంటి ముందు వెదురు బద్దల తడికలతో అల్లిన ఫెన్సింగు. ఇంటి ముందు వేసిన పందిర మీదకి ప్రాకి గుబురుగా అల్లుకున్న సన్నజాజి. ఓ పక్కగా తెల్లవారేసరికి గంపెడు పూలను విరబూసే తెల్ల గన్నేరు చెట్టు. నూతి గట్టు పక్కన క్రోటన్స్. రాత్రివేళ వాటి వాసనలు మత్తుగా అదో గమ్మత్తుగా ఉండేవి. ముఖ్యంగా పెరటివేపు కొద్దిపాటి దూరంలో ఎత్తయిన మెట్ట ఉండేది. దాని మీద కోతులు యధేచ్ఛగా తిరుగాడేవి. అప్పటి తన పసి మనసుకి వాటి సంఖ్య అసంఖ్యాకంగా తోచేది. అవి చేసే అల్లరి చెప్ప నలవి కానిదిగా ఉండేది. విస్ఫారిన నేత్రలతో విస్తుపోతూ వాటి ఆగడాలని చూసేవాడు తను. బాల్యంలో అప్పు డా ఇల్లూ, దాని పరిసరాలూ సుందరాని కొక వింత ప్రపంచం. ఒక డిస్నీ లాండ్.

తను పుట్టిన గ్రామాన్నీ ఆ ఇంటినీ ఒకసారి కళ్ళారా చూడా లనిపించి వచ్చాడు. దాదావు అయిదు దశాబ్దాల తర్వాత ఆ ఇంటిని చూడబోవడం - మాటలకీ ఊహలకీ అందని ఒక అందమయిన అనుభవం. మరచిపోలేని మధురమయిన అనుభూతి. జీవిత చరమాంకంలో నెమరువేసుకోడానికి మిగిలే తీయని జ్ఞాపకం.

అందుకే శరీరం అంతగా సహకరించకపోయినా, డబ్బు చాలీ చాలకుండా ఉన్నా ఒక విధమయిన పట్టుదలతో ఇక్కడి కొచ్చేడు.

తెల్లవారుఝామునే రై లెక్కి పొద్దెక్కకుండానే ఈ ఊరు చేరాడు. అనుకోని విధంగా కేంప్ పొడిగించాల్సి వచ్చి బట్టలు బాగా నలిగిపోయినా ఖాతరు చెయ్యలేదు. గడ్డం మాసిందన్న స్పృహ కూడా లేదు. ఈ ఊరు చూసే ఉబలాటంతో రాత్రంత నిద్ర పట్టక అటూ ఇటూ దొర్లుతూ గడిపాడేమో - కళ్ళు చింతనిప్పుల్లా తయారయ్యాయి.

తనా అవతారంతో ఎవరి కయినా అనుమానాస్పద వ్యక్తిగా తోచవచ్చునని సుందరానికి ఎందుచేతనో తట్టనే లేదు.

రైలు దిగి, ఊళ్ళోకి అడుగు పెడుతూనే స్వర్గంలోకి అడుగు పెట్టిన వాడిలా అనుభూతి చెందాడు సుందరం. ఏ నిర్వచనానికీ లొంగని భావోద్రేకంతో కదిలిపోయాడు.

తను పుట్టిన గడ్డ మీద ఎన్నో సంవత్సరాల తర్వాత అడుగు పెట్టడం అతనికి వింత అనుభవంలా తోచింది. తాతగారి మరణంతో ఈ ఊరితో తమకు అనుబంధం తెగిపోయి అప్పుడే దాదాపు నలభై అయిదేళ్ళకి పైగా కావొస్తోంది. మామయ్యలు, పిన్నీ అంత తలో దిక్కుకీ చెదిరిపోయారు. అమ్మమ్మ చివరి ఊపిరి తన తండ్రి చేతుల్లోనే వదిలింది. తండ్రి ఉద్యోగం కోస్తా జిల్లాలలో మారుమూల. తాతగారి ఊరుతో తనకే కాక అమ్మవేపు బంధువులకి కూడా ఋణం తీరిపోయింది. అంత ఈ గ్రామానికి కొన్ని వందల మైళ్ళ దూరం చెదిరిపోయారు. దాదాపు అందరూ మరచిపోయేరు - తను మాత్రం - మెదడు పొరల్లో నిక్షిప్తమయిన ఆ జ్ఞాపకాలని మరచిపోలేకపోయాడు.

పెరిగిన బాధ్యతలూ, జీవిత పోరాటంతో అలసిపోయిన తను మళ్ళీ ఈ గ్రామం చూడగలడని ఊహించ నయినా లేదు. అనుకోకుండా అవకాశం చిక్కింది. ఉబ్బి తబ్బి బ్బయిపోయి ఇక్కడికి వచ్చి వాలాడు.

తీరా గ్రామంలోకి అడుగు పెట్టిన తనా ఇంటిని ఎలా కనుక్కోగలడనే సందేహం మొదటిసారి మొలకెత్తింది సుందరానికి. తెలీని ఉద్వేగంతో వచ్చేశాడే కానీ, ఆ చిన్నప్పటి ఇంటిని కనుక్కోవడం ఎలాగ?

అ దంత సులభ సాధ్యమయిన విషయం కా దనిపించింది సుందరానికి. ఆ ఇల్లు, ఇంటి వాతవరణ మయితే స్పష్టంగా గుర్తుంది కానీ, అదెక్క డుందో ఊహకందడంలేదు. తన పసితనపు అనుభూతులన్నీ ఆ ఇంటితోనే పెన వేసుకుని పోయాయి తప్ప - ఊర్లో తక్కిన ప్రదేశా లేవీ తనకి పరిచిత పూర్వాలు కావు. మరెలా ఇంటిని గుర్తు పట్టడం? ఇంతకీ ఆ ఇల్లు కూడా పూర్వంలాగే ఉండి ఉంటుందని త నెలా అనుకుంటున్నాడో సుందరానికి ఒక పట్టాన అర్థం కాలేదు. ఆ పాత పెంకుటింటి స్థానంలో ఏ భవనం వెలిసిందో? ఆ ఇల్లు ఎన్ని మార్పులకి లోనయిందో! ఈ విషయం ఇంతవరకూ తనకి స్ఫురించనందుకు సుందరం చకితు డయ్యాడు. తన మనసు లోతుల్లో ఆ ఇల్లు అలాగే పచ్చగా ఏ మార్పూ చెందకుండా ఉండాలనే కోరిక స్ఫుటంగా నిబిడీకృతం కావడంవల్లనే కాబోలు తన కా ఆలోచన రాలేదు. సుందరానికి న వ్వొచ్చింది. అయినా పట్టుదల సడలలేదు. ఆ ఇంటిని వెతుక్కుంటూ ఊరంత తిరిగాడు. వీధి వీధి గాలించి చూశాడు. మూల మూలలూ జల్లెడ వేసినట్టు పరిశీలించాడు. అలుపూ సొలుపూ లేకుండా తిరిగాడు. పిచ్చి పిచ్చిగా తిరిగాడు. బరువెక్కిన గుండెతో. చెమ్మగిల్లిన కళ్ళతో తన చిన్నప్పటి ఇంటి కోసం వెతుక్కున్నాడు.

ఎంత తిరిగినా ఆ ఇల్లు కనబడలేదు సుందరానికి. కనీసం ఆ ఇల్లు ఉండే పరిసరాలని కూడా పోల్చుకోలేకపోయాడు. ఊరంత కొత్త కొత్త బిల్డింగులు లేచాయి. ఊరు ఈ యేభయ్యేళ్ళలో తెగ బలిసిపోయింది. అక్కడా అక్కడా పాత ఇళ్ళు కనిపించినా, వాటిలో తమ ఇల్లు లేదు -

తన బాల్యం తన కళ్ళెదుటే తునా తునకలయిపోయినట్టు తోచింది సుందరానికి. తన గుండె పొరల్లోంచి ఒక అందాన్ని, ఒక అద్భుతాన్ని ఎవరో బలవంతాన పెకలించి పారేసి నట్లనిపించింది. ఇంతకన్నా దారుణమయిన

ఓటమి జీవితంలో మరొకటి ఉండబో దనిపించింది.

ఎంతో పదిలంగా దాచుకున్న ఊహల విరజాజి వాడి వత్తలైంది. బాల్యం బ్రద్దలైంది.

జన్మ నిచ్చిన అమ్మ ఆ ఇంట్లోనే కన్ను మూసింది. ఆ సన్నజాజి పందిరి కిందే ఉగ్గు పట్టింది అమ్మ. ఆ గన్నేరు పూలు తన చేత ఏరిస్తూ ఎన్నో ఊసులు చెప్పింది. ఆ ఇంటిని చూడగలిగితే అమ్మని మళ్ళీ చూసినంత తృప్తి తనకి దక్కేది.

సుందరం గుండె ఆవేదనతో బరువెక్కింది. ఆ సుందర స్వర్గాన్ని తన కళ్ళకి కనిపించకుండా ఎవరు చెరిపేశారు? అతని మనసు బాధగా మూలిగింది.

ఎండ రాను రాను తీక్షణమవుతోంది. ఎండ వేడిమినీ, ప్రయాననీ లక్ష్య పెట్టే స్థితిలో లేడు సుందరం. రెట్టించిన పట్టుదలతో మరోసారి ఊరంత చుట్టబెట్టాడు.

ఫలితం శూన్యం. నిస్త్రాణగా ఓ చోట స్తబ్దంగా నిలబడిపోయాడు. సరిగ్గా - ఆ పరిస్థితిలో సుందరం దగ్గర కొచ్చాడు, బుర్రమీసాల పోలీసు కానిస్టేబులు. అనుమానంగా కళ్ళలోకి సూటిగా చూశాడు. ఉదయం నుంచీ తిరిగి, తిరిగి అలసిపోయేడేమో - సుందరం రూపం మరింత వికారంగా తయారయింది. మాసిన బట్టలూ, చెమటతో జిడ్డుకారుతున్న ముఖం, భుజాన వేలాడుతున్న సంచీ అతనిలో ఏ సందేహాలు రేకెత్తించాయో - దగ్గరికి వచ్చి ఆరాలు తీయడం ప్రారంభించలేదు. సుందరం కోస్తా జిల్లాల యాస విని వింతగా చూశాడు. అతికీ అతకని భావ ప్రకటనతో అతను చెప్పే మాటలు ఆ పోలీసులో అనుమానాన్ని మరింత బలపరిచాయి.

తన వెంట స్టేషనుకి రమ్మని హుంకరించాడు. పరిస్థితి అర్థం కావటం ప్రారంభించేసరికి సుందరంలో కలవరపాటు మొద లయింది. ఏదో చెప్పడానికి ప్రయత్నించాడు. దీనంగా వేడుకున్నాడు. చేతు లొగ్గి దండం పెట్టాడు. అతను బలవంతంగా జబ్బ పట్టుకుంటే పెనుగులాడాడు. చుట్టూ జనం మూగి పరిస్థితి మరింత గందరగోళంగా తయారయింది. తలొకరూ తలో వ్యాఖ్యానం చేశారు. మొత్తానికి సుందరాన్ని అందరూ కలిసి ముద్దాయిగా నిలబెట్టేశారు.

ఇటీవల గ్రామంలో పెచ్చు పెరిగిపోతున్న జేబుదొంగతనాలకు బాధ్యత అతని మీదకు నెట్టారు.

ఉన్నట్టుండి పేద లుండే ప్రాంతలలో గుడిసెలు భగ్గున అంటుకోడానికి సుందరమే కారణమని నిర్ణయించారు.

తీవ్రవాది కాబోలని సందేహపడిన వాళ్ళూ లేకపోలేదు.

సుందరం నిలువునా క్రుంగిపోయాడు. అతని జవసత్వాలు ఉడిగిపోయి నట్టయింది. మనిషి అచేతనుడయాడు. సుందరాన్ని నెట్టుకుంటూ పోలీసు స్టేషన్‌కు దారితీశాడు బుర్రమీసాల పోలీసు.

అవమానంతో, ఆరాటంతో, సిగ్గుతో తల కుదించుకుపోగా అతని వెంట నడిచాడు సుందరం.

** ** **

అలికిడి వినిపించి బరువుగా కళ్ళు తెరిచాడు సుందరం. స్టేషన్లో జవాన్లు ముందు గదిలో చేరారు. ఎస్సై వచ్చాడు. త నున్న చోటునుంచి కొంచెం ముందుకి వంగి చూస్తే అతని ముఖం కనిపిస్తోంది సుందరానికి. ఎస్సై వయసులో చిన్నవాడే. ముఖంలో కాఠిన్యం అంతగా కనిపించడంలేదు. వృత్తిలోని కఠినత్వం అత న్నింకా కల్మషవరచలేదు. తన మొర వింటాడనే ఆశ చిగురించింది సుందరం మనసులో. ముఖాన పట్టిన చెమట జిడ్డు అరచేతులతో రుద్దుకున్నాడు. లేవబోయాడు. నీరసంతో శరీరం తూలినట్టయింది. మళ్ళీ బెంచీ మీద కూలబడ్డాడు.

ఎస్సై నుంచి తనకి కబు రొస్తుందని క్షణాలు లెక్క పెట్టుకుంటూ కూచున్నాడు. నిముషాలు బరువుగా గడుస్తున్నాయి. చాలాసేపటికి సుందరాన్ని స్టేషనుకి లాక్కుని వచ్చిన కానిస్టేబులు ఎస్సైతో ఏదో చెప్పాడు. మరో పది నిముషాలకి ఎస్సై నుంచి సుందరానికి కబు రొచ్చింది. పడుతూ లేస్తూ వెళ్ళి ఎస్సై టేబిలు ముందు నించున్నాడు సుందరం.

ఎస్సై లోతుగా సుందరం కళ్ళలోకి చూశాడు. సంగ తేమిటన్నట్లు క ళ్ళెగరేశాడు. తన నిర్దోషిత్వాన్ని నురూపించుకునే ఆఖరి అవకాశం చెయ్యి జారిపోనివ్వదల్చలేదు సుందరం. అతనిలో లేని తెగింపు పుట్టుకొచ్చింది.

ఒక్కొక్క మాటా పేర్చుకుంటూ, అయినా సూటిగానే తన వైనం అంతా పూస గుచ్చినట్లు చెప్పుకొచ్చాడు. అంతా చెప్పి చివరికి - "సార్ నన్ను నమ్మండి - చిన్న చిన్న అనుభూతుల కోసం వెంపర్లాడే నగటు ప్రాణం సార్ నాది. నా చిన్నప్పటి ఇంటినీ, అందులో చచ్చిపోయిన మా అమ్మ స్మృతుల్నీ బాల్యాన్నీ చూసుకోవాలనే ఆరాటంతో ఊరంత తిరిగాను సార్. చేవ చచ్చిన జీవితంలో-

# ఒక మూల

అంతం లేని ఈ మహా పట్టణంలో
ఒక మూల నా కో నేస్తం.

రోజులూ, వారాలూ ప్రశాంతంగా నడుస్తున్నాయి
నాకు తెలిసే లోపల
ఒక సంవత్సరం గతించింది.

*

నా నేస్తం ముఖాన్ని ఎప్పుడూ చూడను
ఎందుకంటే ఈ జీవితం
మహా వేగవంతమైన పరుగు పందెం.
అతనికి తెలుసు నాకు అతనంటే ఇష్టమని
గతంలో నా ఇంట్లో అతను - అత నింట్లో నేను
కలుసుకునే వాళ్ళం.

*

మే మిప్పుడు కార్య నిమగ్నులం - అలసిపోయాం
తెలివి తక్కువ ఆటలతో అలసిపోయాం.
"రేపు జిమ్మీని కలుస్తా" నని అంటూ
నే నతణ్ణి తలుచుకుంటున్నా నని చెప్పడానికి

*

కానీ రేపు వస్తుందీ - రేపు పోతుంది
మా మధ్య దూరం మాత్రం పెరిగిపోతుంది
ఒక మూల - మైళ్ళ కొద్దీ దూరంగా.
"ఇదుగో తంతి వార్త"
"జిం చచ్చిపోయాడు"

అదే మాకు చివరికి దొరికేది - దొరకాల్సింది
ఒక మూల - కనుమరుగైన ఓ నేస్తం.

[సిహెచ్. టౌనె ఆంగ్ల కవితకు స్వేచ్ఛానువాదం]

- వేమూరి వేంకటేశ్వర శర్మ

చేదు మిగిల్చే వర్తమానం నుండి - ఒక్కసారి, ఒకే ఒక్కసారి పసితనపు మిసిమి ఛాయల్లోకి తొంగి చూద్దామన్న ఉబలాటం తప్ప, మ రే నేర ప్రవృత్తీ నాకు లేదు సార్... నన్ను నమ్మండి'' అంటూ వేడుకున్నాడు. డగ్గుత్తికతో సుందరం కంఠం జీరబోయింది.

ఎస్సై వదనంలో గాంభీర్యం చోటునే రవంత ప్రసన్నత చోటు చేసుకుంది. మంచినీళ్ళు తెప్పించి సుందరం చేత తాగించాడు. ఓదార్పుగా చూస్తూ కూచోమని కుర్చీ చూపించాడు.

సుందరం కాస్త స్తిమితపడ్డాక తక్కిన వివరాలడిగాడు.

"అన్నట్టు మీ తాతగారి పే రేమిటన్నారు? ఈ ఊళ్ళో అత నేం చేస్తుండేవారు?'' అ నడిగాడు.

"మా తాతగారి పేరు లక్ష్మణమూర్తిగారు. ప్రైవేటు డాక్టరు. అంతా 'డాక్టర్ బాబాయ్' అనేవారు-'' చెప్పాడు సుందరం.

ఆ మాట వింటూనే చప్పున లేచి నించున్నాడు ఎస్సై. "వాటె సర్‌ప్రైజ్! డాక్టర్ బాబాయ్‌గారు మీ తాతగారా! మా నాన్నగారు చెబుతూ ఉండేవారు - వారి తండ్రిగారు అంటే మా తాతగారు తీవ్రంగా జబ్బు పడ్డప్పుడు వైద్యం చేసి మా తాతగార్ని రక్షించి ప్రాణదానం చేసింది డాక్టర్ బాబాయ్‌గారేనట. వారి గురించీ, వారి మంచితనం గురించీ మా నాన్నగారు ఎన్నోసార్లు చెప్తూ ఉండేవారు. అయితే, ఉద్యోగరీత్యా నే నీ ఊరు రావడమే తప్ప, నేను లోగడ ఇక్కడికి రాలేదు. చాలా సంతోషం. మీ మనసు మావాళ్ళ వల్ల గాయపడితే మన్నించండి. మిమ్మల్ని అనుమానించి తీసుకొచ్చి, మీ మనసెంత గాయపరిచాడో మా కానిస్టేబులు. అందుకు నేను సిగ్గుపడుతున్నాను...'' అంటూ ఏవేవో చెప్పాడు.

సుందరానికి ఆ మాటలు సంభ్రమంగానూ, తట్టుకోలేనంత సంతోషంగానూ అనిపించాయి. తరువాత ఆ మాటా ఈ మాటా మాట్లాడుకున్నాక, సుందరాన్ని సాదరంగా వీడ్కోలిచ్చి పంపాడు ఎస్సై.

తను ఆశించినది సాంతం నెరవేరకపోయినా, అదో విధమయిన తృప్తితో బ స్సెక్కాడు సుందరం.

** ** **

సుందరాన్ని సాగనంపి స్టేషన్ గదిలోకి తిరిగి వచ్చిన ఎస్సైని చూస్తూ వింతగా కళ్ళప్పగించి ఉండిపోయాడు బుర్రమీసాల కానిస్టేబులు. జరిగిన తప్పిదంలో తన భాగస్వామ్యం ఎంతో నిర్ధారించుకోలేక నీళ్ళు నములుతూ 'సార్' అంటూ ఏదో చెప్పబోయాడు.

అతన్ని కళ్ళతోనే వారించి ఎస్సై ఇలా అన్నాడు: "చూడు... అనుమానించడం మన వృత్తి లక్షణమే అయినా, దానికీ కొన్ని హద్దులుంటాయి. నేరస్థుడ్ని వెతికి పట్టుకోవడం ఎంత ప్రధానమో, ఒక నిరపరాధి నిర్దోషిత్వాన్ని సకాలంలో సక్రమంగా గుర్తించడం కూడా అంతే ముఖ్యం. ఏమంటావు?''

ఆ మాటల్లో సత్యాన్ని అంగీకరిస్తూ కానిస్టేబుల్ త లూపాడు. ఆ తర్వాత ఏదో గుర్తొచ్చిన వాడిలా "అయితే సార్ మీ తాత గారు..'' అంటూ అడగబోయి సందిగ్ధంగా ఉండిపోయేడు.

ఎస్సై అతని ముఖంలోకి చూసి చిరునవ్వు నవ్వేడు. సమాధానం చెప్పలేదు. అతని చూస్తే అతను సుందరంగారితో చెప్పిన దంతా అబద్ధమేనని స్పష్టమైపోతూనే ఉంది కానిస్టేబుల్‌కి.

అయితే - ఎస్సైగా రతనితో ఏ ప్రయోజనాన్ని ఆశించి అతన్ని మభ్య పెట్టారో కానిస్టేబుల్‌కి తల బించుకున్నా అర్థం కాలేదు; కాదు కూడా! ◆

